# అత్తగారూ - అరటి చెట్టు

ఆ రోజు మామయ్యగారి తద్దినం. అత్తగారి మనసు మనసులోలేదు. పదిహేను సంవత్సారాల క్రితం పరమపదించిన భర్తను తలచుకొని ఆమె

మనసు పాడు చేసుకొందని మీరు అనుకొంటే పప్పులో కాలేశారన్నమాటే! ఆమె మనస్థాపానికి అది కాదు కారణం.

మండుటెండలో రెండోసారి బజారుకెళ్లి వట్టి చేతుల్తో తిరిగివచ్చాడు మా రెండో అబ్బాయి నానాజీ. వైశాఖ మాసం కావడం వల్ల ఉదయం పది గంటలకే ఎండ నిప్పులు చెరుగుతోంది. వాడు తెచ్చిన వార్తవిని మరీ చిందులు వేయడం మొదలుబెట్టారు మా అత్తగారు.

"పెద్ద బజారు కూడా చూశాను, మామ్మా! ఎక్కడా అరటాకులు అమ్మడంలేదు!" ఉసూరుమంటూ చెమటలు తుడుచుకొంటూ చెప్పాడు నానాజీ.

"నా మాటమీద నీకు నమ్మకంలేదు, మామ్మా! ఎండలో తమ్ముడ్ని రెండుసార్లు తిప్పావ్!" మామ్మగారిమీద చికాకు పడ్డాడు పెద్దబ్బాయ్ రాజా. వాడు తెల్లారి లేచి బజారంతా తిరిగివచ్చాడు. పొద్దెక్కాక పల్లెటూర్లనుంచి తెచ్చి అమ్ముతారని అత్తయ్యగారి ఆశ. మరోసారి వెళ్లమంటే మండిపడతాడని రెండో మనమణ్ణి రెండు సార్లు (ట్రిప్పుకి అర్ధరూపాయి లంచం ఇచ్చి) పంపారు అత్తగారు.

అరటాకు లేకుండా తద్దినం ఎలా?......ఇది అత్తగారి మనస్సు వికలం చేసిన సమస్య.

"సుగుణా!" మినపప్పు రుబ్బడం ఆపి పిలిచారు అత్తయ్యగారు.

కూరలు తరగడం ఆపి, ఆమెకు దగ్గరగా వెళ్లి నిలబడి "చెప్పండి"! అన్నా.

"వర్ధనమ్మగారి పెరట్లో అన్ని చెట్లున్నాయి కదా! రెండాకులైనా దొరక్కపోతాయా! మరోసారి అడుగుతేనో!" అన్నారు ఆశగా.

ఉదయమే వెళ్లి అడిగానండి! నన్నే పెరట్లోకివెళ్లి కోసుకోమన్నారు. మూడు చెట్లు గెలలు వేశాయ్! చిన్న చెట్లకి ఆకులు లేవు. మొండిగా ఉన్నాయ్. మూరెడాకు కూడా లేదు. నేనే స్వయంగా చూశా!" చెప్పాను.

నిరుత్సాహపడ్డారు అత్తగారు.

మా ఇంటి ప్రక్కనే ఉన్న అచ్యుతలక్ష్మిగారి పెరట్లో రెండు బారల పొడవున పెద్దపెద్ద ఆకుల్తో అరటి చెట్లు కన్పిస్తున్నాయ్. కానీ, ఏం లాభం? ఆమె ఎవరికీ ఇవ్వదు. ఆకు కోస్తే అత్తం తగ్గిపోతుందని ఎవరో చెప్పారట! తమకే అవసరం వచ్చినా కోసుకోమనీ, బజార్లో కొనుక్కొంటామని ఇదివరలో చాలసార్లు మాటల సందర్భంలో చెప్పింది. ఆమెను అడిగినా 'ఇవ్వను' అని నిర్మొహమాటంగా చేప్పేస్తుంది. లీడింగ్ లాయర్‌గారి భార్య నన్న అహంకారం, అహంభావం ఎక్కువ. ఒకరి లక్ష్యంలేనట్లు మాట్లాడుతుంది.....

❖ ❖ ❖ ❖ ❖

మాదిస్వంతఇల్లే. అయినా అరటిచెట్టు వేసుకొనే భాగ్యం లేదు. అరటి చెట్టు అచ్చిరాదు అంటూ పెరట్లో వేయనీయరు అత్తగారు. దానికొక కథ ఉంది(ట) మామగారి ముత్తాతగారి హయాంవరకూ మా పెరళ్లలోకూడా అరటిమొక్కలు ఉండేవట. ఆ ముసలాయన(అంటే మామగారి ముత్తాతగారు...పేరు తెలియదులెండి) ఒకనాడు నిద్ర లేవగానే పెరట్లో ఉన్న అరటిచెట్టు ముఖం చూశారట. అంతే....ఆ రాత్రి అకస్మాత్తుగా ఏ జబ్బులేకుండానే మాట్లాడుతూనే తన తొంభైమూడవ ఏట మరణం పొందారట. ఆ క్షణంనుంచి మా వంశంలో ఎవరి పెరట్లోనూ అరటిచెట్టు వేయగూడదని, -అది అచ్చిరాదని తీర్మానించారట. ఆ తీర్మానం ఆచారమై కూర్చుంది. మా ఇంటి పేరుగలవారెవరి పెరళ్లలోనూ అరటిచెట్లు ఉండవు.

అయితే, ఆ మధ్య అంటే ఆర్నెల్ల క్రితం మా చిన మామగారు రాజమండ్రిలో

కూతురికి పెళ్లి చేశారు. ఆయన అక్కడ స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసర్. రెండు సంవత్సరాల క్రితం దానవాయిపేటలో ఓ ఇల్లుకొని రీమోడల్ చేశారు. రెండంతస్థుల మేడ కట్టారు. వారి ముగ్గురు అబ్బాయిలు మంచి ఉద్యోగాలే చేస్తున్నారు. ఒకడు ఇంజనీర్. రెండోవాడు డాక్టర్. మూడోవానికి ఈ మధ్యనే లెక్చరర్ ఉద్యోగం వచ్చింది రాజమండ్రిలోనే. పెద్దమ్మాయిని డాక్టర్‌కిచ్చి పెళ్లి చేశారు. రెండో అల్లుడు ఇంజనీర్. ఆ రెండో అమ్మాయి పెళ్లికి రాజమండ్రి వెళ్లాం. ఆయన ఇల్లుకట్టాక మేం వెళ్లడం అదే మొదటిసారి.

పెళ్లి పెద్దఎత్తున చాల ఘనంగా చేశారు. వీధిలో పెద్ద పందిరి వేశారు. మామిడాకుల తోరణాలు విచిత్రరీతిలో అందంగా కట్టబడి ఉన్నాయి. ప్రతి పందిరి రాటకు గెలతో ఉన్న అరటిచెట్లు కట్టారు. ఆ పైన రంగురంగుల రకరకాల విద్యుత్‌దీపాలు విచిత్రమైన విన్యాసాలు చేస్తూ చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి.

మా పిన్నత్తగారు తోటికోడలకి ఇల్లంతా చూపించారు. పెరట్లో పెద్ద ఖాళీ జాగా ఉంది. అక్కడ అరటితోట ఉంది. కనీసం ముప్పై చెట్లన్నా ఉంటాయి. చాల చెట్లు గెలలు వేశాయి. ఎంతో శోభాయమానంగా లక్ష్మీకళ ఉట్టిపడుతోంది.

అత్తగారిని పక్కకు పిలిచి నెమ్మదిగా అన్నా. "మనకి అరటిచెట్లు అచ్చిరాదన్నారు. వీరి పెరట్లో ఎంత పెద్ద తోట ఉందో చూడండి. ఏ అరిష్టమూ మూడలేదు సరికదా సంసారం ఎలా పొంగుకొస్తుందో! ఈ ఇల్లుకొన్నాకా మామయ్యగారికి ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. పెద్దబ్బాయికి ముగ్గురు ఆడపిల్లల తర్వాత మొగపిల్లవాడు పుట్టాడు. అబ్బాయికి కూడా అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రమోషన్ వచ్చింది. ఆఖరి అబ్బాయికి లెక్చరర్ ఉద్యోగం లభించింది. అమ్మాయికి మంచి సంబంధం కుదిరింది. ఆ ఇల్లు కొన్నాక ఆ ఇంట్లో జరిగిన శుభకార్యాల్ని - శుభపరిణామాల్ని ఏకరువు పెట్టాను. మా ఇంట్లోకూడా అరటితోట వేయడానికి అత్తగారిని అంగీకరింపచేయాలని నా ప్రయత్నం.

అత్తయ్యగారు సమాధానం చెప్పలేదు. ఆ అరటితోటవైపు చూస్తూ ఉండిపోయారు. పెళ్లి హడావుడి అయ్యాక అంతా తీరిగ్గా కూర్చున్నాం, ఓ

అరగంటసేపు. తోటికోడల్ని అడిగారు మా అత్తయ్యగారు. నేను ప్రక్కనే ఉన్నాను. "ఏమే విజయా! అరటితోట మరిదిగారే వేయించారా?"

"లేదక్కయ్యా! మేమీఇల్లు కొన్నప్పుడే నాలుగైదు మొక్కలు ఉండేవి. వాటికి నీళ్లు-పాలు ఏదీ పోయనవసరంలేదు కనక అలా ఉంచేశాం. అన్ని విధాల పనికి వస్తాయని. అదే పెరిగి పెద్ద తోట అయ్యింది!"

"మరి మనకి అరటిచెట్టు అచ్చిరాదని అంటారు కదండీ!" మనసులోని శంకను బయటపెట్టా నివృత్తికోసం.

ఆమె తక్కున సమాధానం చెప్పారు.

"అది నిజమేనమ్మా! మనం పెరట్లోవేయగూడదు. వాటంతటవి లేస్తే ఫరవాలేదు!" ఎమెండ్‌మెంట్ ఇచ్చారు.

వాటికి స్వతహాగా బీజవ్యాప్తి గుణంలేదు. కాబట్టి వాటంతటవి మొలిచే ప్రశ్నే లేదు. దుంప అయినా పాతాలి. మొక్కఅయినా నాటాలి. ఆ విషయం ఇంకా చర్చించడం బాగుండదని ఊరుకొన్నా

❖ ❖ ❖ ❖ ❖

అంతలో మా ప్రక్కింటి ఇల్లాలూ అరటితోట యజమాని అయిన అచ్యుతలక్ష్మి పాలసముద్రం నుంచి ప్రభవించిన మోహినీదేవిలా సాక్షాత్కరించింది. వాళ్ల భవనంలో కరెంటు పోయిందట. మాకూ్కడా పోయిందోలేదో అని విచారించడానికి వచ్చానని చెప్పింది.

అచ్యుతలక్ష్మిగారిని చూశాక అత్తగారికి పోయిన ప్రాణం లేచివచ్చింది. అవసరం చాల గట్టిది కాబట్టి సిగ్గు, బిడియం విడిచి అడిగారు. "అరిటాకు దొరకలేదమ్మా! తద్దినానికి చాల ముఖ్యం. కనీసం మూడు ఆకులైనా కావాలి.

"అలాగ పావుగంటలో మా పాలేరు చేత పంపిస్తాలెండి!" అని చెప్పి మమ్మల్నందిర్ని ఆశ్చర్యాంబుధిలో ముంచి నిష్క్రమించింది అచ్యుతలక్ష్మి. తేలికపడిన

మనస్సుతో ఆనందార్ణవంలో మునిగితేలియాడుతున్న అత్తయ్యగారు పప్పురుబ్బడం మరిచిపోయి ఆ అభయప్రదాయినీ అచ్యుతలక్ష్మి అంతర్ధానం అయినవేపే చూస్తూ ఉండిపోయారు.

"అత్తయ్యగారూ!" పిలిచా.

నా పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన అత్తయ్యగారు తిరిగి పప్పురుబ్బడం మొదలుపెట్టారు. అవసరం చెబితే ఎంత పిసినారయినా తప్పకుండా ఇస్తుందమ్మా! పోనీలే, ఆ మూడింటితోనైనా ఎలాగో సర్దుకొందాం!" తృప్తిపడ్డారు.

టైం పదకొండు గంటలు కావస్తుంది. పెద్దమార్కెట్టుకి వెళ్లి నేతి సీసాతో తిరిగివచ్చారు మావారు.

నేయి అందుకుంటూ అడిగా. "అరటిఆకులు ఎక్కడా దొరకలేదాండి?"

ఈ గాలివానకు అరటి తోటలన్నీ పడిపోయాయట. బజార్లో నేనూ చూశా. ఏం చేద్దాం!" తిరిగి నన్నే అడిగారు. "అచ్యుతలక్ష్మిగారిని మీ అమ్మగారు అడిగారు!" అన్నా.

"ఇస్తానందా?" అడిగారు.

"ఏ కళనుందో పంపిస్తానంది!"

హమ్మయ్య అంటూ కుర్చీలో కూలబడ్డారు. మరో అరగంట గడిచింది. అచ్యుతలక్ష్మి గారి పాలేరు అప్పన్న వట్టిచేతుల్తో వచ్చాడు.

"బజారంతా తిరిగానమ్మగారు, ఎక్కడా అరటిఆకు దొరకలేదు. ఈ విషయం మీతో చెప్పమన్నారు మా అమ్మగారు!" చల్లగా చెప్పాడు.

వాడు చెప్పిన వార్తవని నిర్ఘాంతపోయారు అత్తగారు.

ఆవిడ పంపిస్తానంటే ఆకులు పంపడం కాదన్నమాట. బజారుకి మనిషిని పంపించడం అని అప్పుడు అర్థం అయ్యింది. ఆ మాటల్లో ఉన్న మర్మాన్ని ఆలస్యంగా గ్రహించాం.

"పోనీలే అమ్మా! అడ్డాకు విస్తర్లున్నాయి. వాటినే వాడుకొందాం!" అన్నారు మా వారు.

"శాస్త్రం ఒప్పుకోదురా! అరటి ఆకుతోనే దొన్నెలు చెయ్యాలి. అరటి ఆకు మీదనే పిండాలుంచాలి. పితృకార్యానికి అరటి ఆకులు అత్యంత అవసరం. కాని మరేంచేస్తాం. ఈ పదిహేను సంవత్సరాలలోనూ అరటి ఆకు లేకుండా తద్దినం పెట్టలేదు. విచారం వ్యక్తం చేశారు అత్తయ్యగారు.

పన్నెండు గంటలు సమీపిస్తుంటే ఇద్దరు భోక్తలను తీసుకొని వచ్చారు అష్టావధానిగారు. ఆయన అన్నటైంకి సరిగ్గా వస్తారు. వచ్చినతర్వాత ఆగరు. అందుకే పదకొండున్నర గంటలకే మేము రెడీ అయ్యాం.

రాగానే పెరట్లోకెళ్లి ముగ్గురూ స్నానాలు చేశారు. పీటవేసుకొని దర్భలు ముందు పెట్టుకొని కూర్చున్నారు అష్టావధానిగారు.

"సుగుణమ్మా! అరటి అకులు పడేయ్! దొన్నెలు చెయ్యాలి!" కేకేశారు.

"అరిటాకులు ఎక్కడా దొరకలేదండి! అందుకే అత్తగారు చాల బాధపడుతున్నారు!" చెప్పాను.

"అలాగా! మా ఇంటికి మీ అబ్బాయిని పంపండి. నాలుగాకులు ఇస్తుంది!"

ఆవధానిగారి ఆ మాటలు విన్నాక అత్తగారు తెప్పరిల్లారు.

"అబ్బా! ద్వారకానగరం వెళ్లాలి! రానూపోనూ ఆరు మైళ్లు! ఎండలో సైకిల్‌మీద వెళ్లలేను. సిటీబస్సుకి రెండు రూపాయలు అవుతాయి!" పేచీపెట్టాడు పెద్దబ్బాయి రాజా.

"రెండు కాకపోతే అయిదు తీసుకో బాబూ! అర్జంటుగా ఆకులు తెచ్చిపెట్టు!" అంటూ పోపులడబ్బాలో ఉన్న అయిదు రూపాయల నోటుని మనవడి ముందు పడేశారు అత్తగారు.

రాజా బయలుదేరబోతుంటే వెనక్కి పిలిచారు అష్టావధానిగారు. తన చేతికున్న

రిష్టువాచిని తీసి రాజాకి అందించారు. ఈ వాచీని మా ఆవిడకి ఇచ్చి నాలుగాకులు ఇవ్వమన్నానని చెప్పు!" అన్నారు.

"వాచీ మీ ఆవిడగారిదాండి?" అమాయకంగా అడిగాడు రాజా.

సమాధానంగా చిరునవ్వు నవ్వి "మా ఆవిడ అయిదు రూపాయలు అప్పుఅన్నా ఇస్తుందిగాని అయిదంగుళాల అరిటాకు ముక్క ఇమ్మంటే ఇవ్వదు! ఆ సంగతి నీకు తెలియదు. వెళ్లు...వెంటనే రా!" వివరంగా చెప్పారు.

"పావుగంటలో రావాలి!" అన్న నా కేకను వినిపించుకోలేదు రాజా సైకిలెక్కి తుర్రుమన్నాడు. సరిగ్గా నలభైనిమిషాల తర్వాత నాలుగాకులు తెచ్చి పడేశాడు రాజా. ఆకులు చూశాక మా అందరి మొహాలు విప్పారాయ్. అత్తగారి ఆనందానికి హద్దుల్లేవు.

ఆకుల కట్ట విప్పాను. రెండాకులికి చిగుళ్లు లేవు ఆకులు చింకి చింకిగా ఉన్నాయి.

ఆకులు చిరిగిపోయాయి ఏమిరా అని అడిగారు కోపంగా. ఆ ఇల్లాలు చింకి ఆకులు ఇచ్చిందని అవధానిగారికి తెలియజేయాలని ఆమె ఉద్దేశం.

మంచివే ఇచ్చారు అమ్మా దారిలో స్నేహితుడు కనబడితే వాడితో మాట్లాడుతున్నా.... అని నసిగాడు.

వాడు చింపేసాడా బగ్గుమన్నారు అత్తగారు

లేదు మామ్మా వెనకి నుంచి ఆవు వచ్చి తినేయబోతుంటే దాని నోట్లోంచి లాగాను. రెండు ఆకులు చిగుళ్ళు చిరిగిపోయాయి. భయపడుతూ నెమ్మదిగా చెప్పాడు.

అంతేకదా పరవాలేదు కడిగి వేగంగా తీసుకొనిరా సర్దిచెప్పి తొందర చేసారు అవదానిగారు.

పదిరోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం పళ్ళు తోముకుంటూ పెరట్లో అటుఇటు పచార్లు చేస్తున్న నానాజీ గట్టిగా కేకవేసాడు.

అమ్మా అన్నాడో, మామ్మా అని పిలిచాడో సరిగ్గా అర్థంకాలేదు.

గట్టిగా ఉందాకేక ఏ పామో కనిపించి ఉంటుందని భయంవేసింది.

నీళ్ళు తోడుతున్న బాల్టీని గిలక మీద వదిలేసా. ఇంట్లో ఉన్న ఆయనగారిని రమ్మని కేకవేసి నానాజీ దగ్గరకి పరుగుతీసా.

నందివర్ధనం పూలు కోస్తున్న అత్తయ్యగారు నాకన్నా ముందే నానాజీ దగ్గరకి వెళ్ళారు. ఏరా ఏమైంది కంగారుగా మనవడిని అడిగారు.

వాడు ప్రహారి గోడకి బారెడు దూరంలో ఉన్న సన్నజాజి మొక్క మొదలు వైపు వేలుతో చూపించాడు.

ఇద్దరం అటు చూసాం.

ఒరేయ్ రాజా, సీతారాముడూ ఒకసారి ఇలారండిరా అని కేకవేయటం అత్తయ్యగారి వంతుఅయింది.

ఒక్క నిముషం ఆగి ఆ తండ్రి కొడుకులు ఇద్దరూ రాకపోవటంతో ఆలస్యం భరించలేక మరో కేక వేసారు. అర్జంటుగా రండి ఏం చేస్తున్నారు లోపల.

సగం సగం గడ్డం షేవ్ చేసుకుంటూ చేతిలో రేజర్‌తో పరుగున వచ్చారు ఆయన. ఆ వెనుకనే వచ్చాడు రాజా, చేతి నిండా సిరా, బట్టల మీద సిరా వాళ్ళ ఇద్దరిని చూసాక నాకు నవ్వు ఆగిందికాదు ఫకాలుని నవ్వేసాను.

సన్నజాజి మొక్క వైపు చూపిస్తూ అటుచూడండి అన్నారు అత్తయ్యగారు.

ఆమె మొహంలో ఆనందం చిందులు వేస్తోంది.

ఓస్ అంతకొంప మునిగినట్లు పిలిచావు, బట్టలు నిండా సిరా ఒలికి పోయింది. మామ్మగారు మీద చిరాకు పడుతూ తిరిగి వెళ్ళాడు రాజా.

మా శ్రీవారి మొఖంలోకి చూసా

ఆయన తన గడ్డం అద్దంలో చూసుకుంటున్నారు. బ్లేడు చెక్కుకు పోయి రక్తం చిమ్ముతొంది.

ఆయన వాలకం చూసి మరొకసారి గలాగలా నవ్వేసా.

ఆ తర్వాత దొడ్డ రాములు వస్తాడు తీసి అవతల పారేయమను పురమాయించి తిరగి వెళ్ళారు శ్రీవారు.

వారి మాటలకి ఏమాత్రం నిరుత్సాహ పడలేదు అత్తగారు. వారిలో ఆనందం ఏమాత్రం తగ్గలేదు.

దాని అంతట అది పెరట్లో లేస్తే శుభసూచకం. జాగ్రత్తగా శ్రద్ధగా పెంచి పెద్దది చెయ్యాలి. అంటూ పూలు కోయటం మరిచి, ఆ అరటి మొక్క చూట్టూ పాడి కట్టారు, బిందెడు నీళ్ళుతోడి తెచ్చిపోసారు.

సరిగ్గా వారం తిరిగేసరికి .....

మా వారికి సూపర్నెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. మరో పదిరోజులకి మా పెద్దబ్బాయికి పాలిటెక్నిక్ లో సీటు లభించింది.

నే చెప్పా కదమ్మా పెరటిలో అరటి మొక్క ఉంటే ఇంటిలో లక్ష్మి తిష్టవేసుకుంటుంది, అన్న అత్తగారి మాటలకి ఆశ్చర్యం వేసింది.

మరి, అరటి చెట్టు మనకి అచ్చిరాదు అని అన్నారు కదా! నవ్వు ఆపుకుంటూ రెట్టించా.

మనం వేసుకోకూడదమ్మా తమ విశ్వాసాన్ని అభిప్రాయన్ని వదలలేదు అత్తయ్యగారు.

అత్తయ్యగారి ప్రత్యేక పోషణలో ఆ అరటి మొక్క దినదినాభివృద్ధి చెందింది. దాని సంతానోత్పత్తి చూసి మురిసిపోయారు.

నెలలు గడుస్తున్నాయి.

పెద్ద చెట్టు గెల వేసింది. దాని చూట్టూ చిన్నచిన్న మొక్కలు కూడా పెద్దవయ్యాయి. పెద్దపెద్ద ఆకులు వేస్తున్నాయి.

ఆ రోజు మధ్యాహ్నం ఎదురింటిలో ఉన్న రామలక్ష్మి వచ్చింది, కూడా పెద్ద కొడుకుని తీసుకుని వచ్చింది. వాడు మా నానాజీ ఈడు వాడే. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

రామలక్ష్మి తన కూతురిని పురిటికి తీసుకువచ్చింది. అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుంది కబుర్లు చెప్పడానికి.

కూతురుకి ఏఏ పిండి వంటలు చేస్తున్నావమ్మా అడిగారు అత్తగారు యధాలాపంగా.

చాలా రకాలు చేసాను పిన్నిగారూ ఒక్క బొబ్బట్లు తప్ప. అవి రేపు చేద్దాం అనుకుంటున్నా అందుకే వచ్చా బొబ్బట్లు వత్తుకోడానికి అరటి ఆకుముక్క కావాలి వచ్చినపని తెలియజేసింది రామలక్ష్మి మా ఇద్దరి వైపు చూసి.

నేనేమి మాట్లాడలేదు. ఆ అరటి చెట్టు మీద నాకు అధికారంలేదు.

దానికేముందమ్మా ఒక ఆకు కోసుకుని వెళ్ళు.

చెవులతో వింటున్నా అత్తగారు ఆ మాట అన్నారంటే నమ్మశక్యం కాలేదు. ఆవిడిగారి ఔధార్యానికి ఆశ్చర్యంపొందాను!

ఓరేయి గోపి నువ్వు నానాజీ వెళ్ళి ఒక అరటి ఆకు కోసుకురండి. రామలక్ష్మి గారి అబ్బాయికే అత్తయ్యగారు ఆజ్ఞాపించారు.

వారిద్దరూ పెరటిలోకి వెళ్ళి పది నిముషాలు పోయాక తిరిగి వచ్చారు.

ఎక్కడా జానడు ఆకు కూడా లేదు మామ్మగారూ అన్నీ చిరిగిపోయాయ్ చెప్పాడు గోపి. కత్తిపీట క్రింద పారేస్తు.

రామలక్ష్మి నిరుత్సాహపడింది.

ఈ గాలికి ఆకులు చిరిగిపోతున్నాయి. సంజాయిషీ యిస్తు విచారము వ్యక్తం చేసారు అత్తగారు.

అసలి సంగతి ఏమిటో నాకు తెలుసు.

అత్తగారు ఉదయం లేవగానే అరటి మొక్కలను సందర్శిస్తారు. ఆ తరువాతే మిగిలిన పనులు.

ఆకులు బాగా విడగానే బెత్తెడు ముక్క కూడా వదలకుండా పనికట్టుకొని చీరెస్తారు.

ఆ కార్యక్రమములో నానాజీ సాయం చేస్తాడు.

అందినంతవరకు అవిడే చీరుతూ, అందనివి గోడ ఎక్కి నానాజీ చీరుస్తాడు. అవిడ ఆజ్ఞప్రకారం.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
3-4-1985